మినీకథ

# వనితా బా-భద్రం

● కొవిలిపాటి విజయలక్ష్మి

"మూర్తీ! రే, శ్రీనివాసమూర్తి!" కొంచందూరంలో ముందుకి నడిచివెళిపోతూన్న శ్రీనివాసమూర్తిని చప్పట్లుచరుస్తూ నాలుగైదుసార్లు పిలిచాడు విశ్వం.

"ఆగరా! ఎందుకలాగొంతు చించుకుంటావు వాడు పలకడు," అన్నాడు విశ్వం చెయ్యినొక్కి వదిలేస్తూఅతనితోపాటు నడుస్తూన్న రవణ.

'ఎందుకు పలకడు? అస్సలు వాణ్ణి నేనుచూసి చాలాకాలమైపోయిందిరా," ఆగి రవణ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు విశ్వం.

"వాడి జీవిత కథ నువ్వు రాసేశావుట, నువ్వు పెద్ద పేరున్న రైటరువేకావచ్చు, కాని అలా వ్రాసేసి పత్రికల కెక్కించటం," అన్నాడు రవణ విశ్వం ముఖంలోకి చూడకుండా ఎటోచూస్తూ.

"హతోస్మి, ఏరైటరూ ఎవరి చరిత్రలూ రాసెయ్యడు. అయినా వీడేంమహాపురుషుడా పనికట్టుకు వీడి చరిత్ర రాయటానికి? రా అలా పార్కులో కూర్చుందాం" అంటూ రవణ చెయ్యిపట్టుకు నడిపించుకు పోయాడు విశ్వం చుట్టుతా రోడ్లున్న డైమన్ పార్కువైపు.

అతను హెడ్డాఫీసులో పనుండి వచ్చాడు, స్థానికంగా ఆఊర్లోనే ఉన్న రవణ ఓ హోటల్లో టిఫిను చేస్తూంటే కనుపించాడు.

ఎన్నోనాటి మిత్రులవటంతో ఒకరినొకరు ఆప్యాయంగా కుశలప్రశ్నలు వేసుకొని షికారులా రోడ్డువెంట కబుర్లు చెప్పుకుంటూ పోతూన్నవేళ కనుపించాడు శ్రీనివాసమూర్తి. శ్రీనివాసమూర్తీ రవణ అప్పుడప్పుడు కలుస్తూంటారు.

ఇద్దరూ పార్కులో ఓమూల కూర్చున్నతర్వాత రవణ చేతిని తనచేతిలోకి తీసుకుంటూ, రచయిత సామాజిక స్పృహతో వాస్తవం అనిపించేలా కథవ్రాయటానికి ప్రయత్నిస్తాడు, ఆ కథా సంఘటనల్లో మాటల్లో, మాగురించే వ్రాశావని ముఖమెరుగని వ్యక్తులు దండెత్తి వస్తే ఏమంటాం? మూర్ఖులనాల్సివస్తుంది. శ్రీనివాసమూర్తి కథ, అని పకపకా నవ్వి, నిజంగావాడి విషయాలే నాకు తెలియవు, నాభార్య పిల్లలమీదా ప్రమాణంచేసి చెప్తున్నాను. నాకు వాడికేం జరిగిందో వినాలని కుతూహలంగా ఉంది. చెప్పు అన్నాడు విశ్వం.

ఛీ! మనదేశం పాడయి పోతూందిరా, పిల్లలకు, స్త్రీలకు భద్రత లేకుండా పోయింది, ప్చ్ అన్నాడు రవణ.

"నేను అడిగిన దానికి అది జవాబుకాదు" అన్నాడు విశ్వం సీరియస్‌గా.

రేడియోలో వినటంలా! పిల్లలు కనపడటంలేదని, దేశం... అతని మాట మధ్యలో ఆపి దేశం అనకురా బాబు, దేశంలోని మనుషులు రాక్షసులవుతున్నారు అను. ఇంతకీ అస్సలు విషయానికిరా అన్నాడు విశ్వం.

బరువుగా ఊపిరిపీల్చి వదిలి నాలుగేళ్ళక్రితమనుకుంటాను 'తస్మాత్ జాగ్రత' అనే నీ'కథ' వచ్చింది ఏదోపత్రికలో గుర్తుందా? అడిగాడు రవణ.



తల అడ్డంగాఊపి చెప్పు గుర్తుతెచ్చు కుంటాను. అన్నాడు విశ్వం.

వాడు చెప్పింది, నాకు తెలిసింది చెబతావిను. అని చెప్పటం ప్రారంభించాడు రవణ.

చెవులు రిక్కించి వింటున్నాడు విశ్వం.

** ** **

శ్రీనివాసమూర్తికి ఓపల్లెటూరి అమ్మాయితో పెళ్ళయింది. అమ్మాయి అందంగా అమాయకంగా కనుపించేది. వాళ్ళు మంచి బట్టలు పెట్టలేదనీ వాచీ ఇవ్వలేదనీ భార్యని పుట్టినింటికి పంపననీ చిన్నచిన్న పేచీలు శ్రీనివాసమూర్తి పెట్టేవాడని వినికిడి.

వాళ్ళు బతిమిలాడి వీడు మురిపించుకునీ, కొన్ని షర్తులమీద నాలుగేళ్ళ తర్వాత ఆమెను తలితండ్రుల దగ్గరకు పంపాడు, దురదృష్టం వారిఇంట్లో దొంగలుపడి కొన్ని వస్తువులతో వాడి భార్యపేరు పద్మ, ఆమె మెడలోని రెండుపేటల గొలుసూ ఎత్తుకు పోయారు.

ఇంకేముంది? మీవాళ్ళకి ఆగొలుసు ఇచ్చేసిఉంటావు అబద్ధాలాడుతున్నావు అని ఎంతకు ఎన్ని విధాలచెప్పినా, ఎప్పుడో ఇచ్చుకుంటానని మామగారు ఏడ్చినా, వినకుండా భార్యను రకరకాలుగా హింసించటం ప్రారంభించాడట శ్రీనివాసమూర్తి.

ఓ అర్ధరాత్రి అమానుషంగా సిగరెట్‌తో ముఖంమీద వాతలుపెట్టి వీధివాకిట్లోకి నెట్టి తలుపులు మూశాడు.

అంతకాలం ఓర్చిన ఆమె తెగించి పోలీస్ స్టేషను వైపునడిచింది, ఆ ఆపత్‌బాంధవులు తనను కాపాడతారని, కాని కాంపౌండ్‌వాల్, గేటు, మొక్కల్ని మింగేస్తాయని తెలియని అమాయకురాలామె.

అర్ధరాత్రి నిశ్శబ్దం, నిషాలోఉన్న రక్షకభటులు ఆమె మాటలు వింటూనే తలుపులు మూశారు, ఆమె రోదన అరణ్యరోదన, వారు రక్షణగా మూల్యం శీలం దోచుకున్నారు.

చినిగిన జాకెట్టు, విడిన సిగ, నలిగిన చీర ఇంటివైపు పరుగులు తీసింది.

ఉగ్రుడై వీధిగడపలో దర్శనమిచ్చాడు శ్రీనివాసమూర్తి, సన్నగా వణుకుతూ ఏడుస్తూ అతని కాళ్ళకు చుట్టుకుంది పద్మ.

ఎక్కడికెళ్ళావ్! అని కాలితో తన్నాడు శ్రీనివాసమూర్తి.

"నన్ను క్షమించండీ!" అంటూ ఆ అమాయకురాలు, జరిగినదంతా చెప్పేసింది, ఆవిషయం మావగారి కొక్కరికేచెప్పి, "మీ అమ్మాయిని నేనేలుకోను శీలంచెడిన ఆడది నాకొద్దు" అని వదిలేశాడు శ్రీనివాసమూర్తి.

వెధవ ఏమన్నా మందలిస్తే, దేశం, సాంప్రదాయం, పాతివ్రత్యం, వల్లించి ఊదరకొట్టేస్తాడు. సెంటిమెంటల్ ఫూల్, వీడు వెధవతిరుగుళ్ళు తిరుగుతున్నాడిప్పుడు, అన్నాడు రవణ.

వాడికథ రాశావుటనువ్వు అన్నాడుమళ్ళీ.

"వీడిగురించి నేనాకథ రాయలేదు కాని, ఇలాంటి నగ్న సత్యాలు అద్దంపట్టి చూపిస్తే నారచన చదివి ఏఒక్క వ్యక్తిమారినా నారచన సార్థకమైనట్టే," అన్నాడు విశ్వం.

"ఆమె కావాలని తప్పుచేస్తే దండించాల్సిందే! అయినా చిన్న పొరపాట్లు సర్దుకుపోయె సంస్కారులు కావాలి మనవాళ్లు" అన్నాడు రవణ.

రాముడి దగ్గరనుంచీ పాకుతూందిరా మనలో అలాటి రక్తం, ఆఫ్టరాల్. శ్రీనివాసమూర్తి! కీచక రావణులలాటి రక్షకభటులు ఉద్భవిస్తున్నారు. మనది ఆధ్యాత్మిక దేశం అన్నాడు విశ్వం నవ్వుతూ.

కాదంటావా? అడిగాడు రవణ.

"అన్ని దేశాలూ అవునంటె నేనెలా కాదనగలను? అన్నాడు విశ్వం.

సరిగ్గా మనదేశంమీద నీ అభిప్రాయం? అన్నాడు రవణ.

"గులాబి దిగువున ముల్లు ఉన్నట్టు, మంచి చెడు రెండూ ఉంటాయికాని, మన దేశానికి ఉపయోగపడకుండా మేధావులు వలస పోతున్నారు, శంకరభగవత్పాదులు ఏమన్నారో తెలుసా, స్వదేశో భువనత్రయం, అని. పోనీలే వలసపోయిన మనతెలుగువాళ్ళు మననీ మన సంస్కృతినీ మరచిపోకుండా ఉంటె అదేపదివేలు. మరి లేద్దామా" అన్నాడు విశ్వం లేచి నిల్చుంటూ.

ఇద్దరూ పార్కు బయటకు నడిచారు. ●